


18వ వసంతంలోకి
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శనివారం | 8 ఫిబ్రవరి 2025 | పేజీలు 10

# భానుడు.. భగ.. భగ..

- ఎండ వేడిమి తాళలేక పండ్ల రసాలపై మక్కువ చూపుతున్న ప్రజలు
- కొబ్బరి బొండాలకు యమ డిమాండ్
- ఏసీలు, కూలర్లపై రేట్లు పెంచుకుంటున్న డీలర్లు
- గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి ముందే ఎండలు
- 34 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- రోజు రోజుకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- ఇప్పుడే ఇలా ఉంటే మునుముందు వేసవి కాలం ఎలా ఉంటుందో అనే ఆందోళనలో ప్రజలు



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** గతంలో ప్రతి సంవత్సరం శివరాత్రి పోయిన తర్వాతే సాధారణంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కానీ ఈ సంవత్సరం శివరాత్రి ఒక నెల ఉండగానే ఎండలు మండిపోతున్నాయి మామూలుగా శివరాత్రికి చలి శివ..శివా అంటూ వెళ్ళిపోతుందనేది పురాతన కాలంగా వస్తున్న ఓ సామెత. శివరాత్రికి ఇంకా 20రోజుల సమయం ఉన్నప్పటికి చలి జాడ లేకుండా ముందే పోయింది. జోరుగా చలి ఉండాల్సిన సమయం. చలికాలం ఇంకా ముగియనేలేదు కానీ వాతావరణం ఒక్క సారిగా మారిపోయింది. గడిచిన వారం పది రోజులుగా వేడి పెరిగిపోయింది. రాత్రి వేళల్లో చలి ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. ఈసారి చలికాలం సీజన్ మిగతా 2లో

# తెప్పపై పార్థసారథిస్వామివారి కటాక్షం





**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి గోవింద రాజ స్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం సాయంత్రం రుక్మిణీ, సత్యభామ సమేత పార్థ సారథిస్వామి వారు భక్తులను కటాక్షించారు. ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ రోజైన శుక్రవారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు స్వామి వారు దేవేరులతో కలిసి తెప్పపై ఐదు చుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. అదేవిధంగా శనివారం కల్యాణ వేంకటేశ్వర స్వామివారు తెప్పల పై భక్తులను అనుగ్రహించను న్నారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు మిగతా 2లో

# శెట్టిపల్లి భూ పరిష్కారానికి అన్ని విధాల చర్యలు : కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న శెట్టిపల్లి భూ సమస్యల పరిష్కార దిశలో ముఖ్యమంత్రి చొరవతో పరిష్కార దిశగా అన్ని చర్యలు చేపట్టామని, వచ్చే రెండు మూడు వారాల్లో పెండింగ్ వాటిని పరిష్కరించి లేఔట్లకు సంబంధించి పేపర్ మీద ఏర్పాటు, ప్లాటింగ్ చేసి ప్రొసీడింగ్స్ ప్రతులను లబ్ధిదారులకు అందిస్తామని, శెట్టిపల్లి భూ పరిష్కారానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతి నియోజకవర్గం శెట్టిపల్లి గ్రామ పెండింగ్ భూసమస్యలపై కలెక్టర్ జేసీ శుభం బన్సల్, విసి తుడా ఎన్.మౌర్య, ఆర్డీఓ రామ్మోహన్ తదితర సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్ పెండింగ్ ప్రొసీడింగ్స్‌ను మంగళవారం నాటికి ఇచ్చేలా ఆర్డీఓ తిరుపతి వారు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వరాదని ఆదేశించారు. అలాగే సదరు భూముల పేపర్ ఫ్లాటింగ్, రహదారుల ఏర్పాటుకు, మౌలిక సదుపాయాల కల్పన కొరకు తుడా మూడు వారాల లోపు ప్రణాళికా చర్యలు చేపట్టి పురోగతి చూపాలని సూచించారు. అలాగే అధికారికంగా పేపర్ మీద లేఔట్ ప్లానింగ్ చేసి ప్లాట్లను లబ్ధిదారులకు చూపడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అపోహలు వద్దని తెలిపారు. ఈ సమావేశంలో తుడా సిపిఓ దేవి కుమారి, ఎస్డీసీ తుడా అధికారిణి (భూసేకరణ) సృజన తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం సాయంత్రం రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్. వీరికి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి థర్డ్ ఎడిజే జస్టిస్ ఎం.గుర్నాథ్, ప్రోటోకాల్ జడ్జి కోటేశ్వర రావు, కోర్టు సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు, తిరుపతి బార్ కౌన్సిల్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రోడ్డు మార్గాన మదనపల్లెకు బయల్దేరి వెళ్ళారు.





## తెప్పపై పార్థసారథిస్వామివారి కటాక్షం

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో భజనలు, హరికథ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శెట్టిపల్లి భూ పరిష్కారానికి అన్ని విధాల చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

కల్పన కొరకు తుడా మూడు వారాల లోపు ప్రణాళికా చర్యలు చేపట్టి పురోగతి చూపాలని సూచించారు. అలాగే అధికారికంగా పేపర్ మీద లేఔట్ ప్లానింగ్ చేసి ప్లాట్లను లబ్ధిదారులకు చూపడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అపోహలు వద్దని తెలిపారు. ఈ సమావేశంలో తుడా సిపిఓ దేవి కుమారి, ఎస్డిసీ తుడా అధికారిణి (భూసేకరణ) సృజన తదితరులు పాల్గొన్నారు.

## రాజేని ఆధ్వర్యంలో విద్యార్థులకు గోరుముద్ద

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** చిల్లకూరు మండలం రెట్టపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాలలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోరు ముద్ద కార్యక్రమం ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అంది స్తారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పేదరికం అంటే ఏమిటో బాగా తెలుసునని, పదో తరగతి చదువుకునే రోజుల్లో కాళ్లకు చెప్పులు కూడా కొనుక్కొని వేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నానని, కసి పట్టుదలతో చదివి నేడు ఈ స్థాయికి చేరానని, ఇందుకు చదువు ఒక్కటే కారణమని ప్రతి విద్యార్థి పేద పరిస్థితిని గుర్తుంచుకొని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరి పదిమందికి సహాయ పడాలని కోరారు. క్రీడల్లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి 10,116 ట్రస్ట్ తరఫున అందజేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. విద్యార్థులచే పాఠశాలలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రామయ్య నాయుడు, పాఠశాల ప్రధానో పాధ్యాయిని విజయలక్ష్మి, నెల్లూరు రూరల్ ఎంఈఓ అబ్దుల్ హమీద్, శివ సుబ్రహ్మణ్యం, పివికె రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, బాబు, అన్వేష్, కిరణ్ రెడ్డి, ముని భాస్కర్, రమణయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి రైతులు ధన్యవాదాలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** క్రిస్ సిటీలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరు చేయించిన ఎంఎల్ఏ డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌కు ఆయా గ్రామాల రైతులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఉదయం తమ్మినపట్నం గ్రామంలో ఎంఎల్ఏ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి ముఖ్యమంత్రి చంద్రాబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలిపారు. తమ్మినపట్నం, లింగవరం రెవిన్యూ పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రిస్ సిటీ కి సంబంధించిన భూములకి పరిహారం పంపిణీలో స్థబద్దత నెలకొనగా ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి క్యాబినెట్‌లో ఆమోదింప చేసుకుని శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ రైతులకి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కోట సతీష్‌యాదవ్, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# భానుడు భగ... భగ..

(మొదటిపేజీ తరువాయి)



ఏ మాత్రం జనాన్ని వణికించలేకపోయింది. ఉదయం 10 దాటితే ఎండలు ముదురుతున్నాయి. మధ్యాహ్నం పూట రోడ్లమీద నిలువ లేని పరిస్థితి. అప్పుడే ఎండలు ముదురుతుండడంతో రాబోయే వేసవి సీజన్‌లో పరిస్థితి ఎలా ఉండబోతుందో అన్న ఆందోళన ప్రజల్లో మొదలైంది. ఎండ వేడిమి రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రమాదగంటికలు అప్పుడే మోగుతున్నాయి. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో జనాలు అనారోగ్యం పాలవుతున్నారు. క్రమంగా తగ్గాల్సిన ఒక్కసారిగా పడిపోయింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో వాతావరణ సమతుల్యత లోపించి ప్రజలు తీవ్ర జ్వరాల బారిన పడుతున్నారు. వీటికి తోడు భూగర్భ జలాలు భారీగా అడుగంటడం, విద్యుత్ సరఫరాలు అంతరాయం ఏర్పడటంతో రాబోయే వేసవిపై ముందుగానే భయం పట్టుకుంటుంది. నిన్న మొన్నటి వరకు 25 డిగ్రీల లోపు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, గడిచిన నాలుగైదు రోజులుగా 34 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే రాబోయే రోజుల్లో ఏంటి అనే ఆందోళనలో ప్రాణాలు బిక్కు బిక్కు మంటున్నాయి.

**ఎండ వేడిమి తాళలేక పండ్ల రసాలపై ఎక్కువ మక్కువ చూపుతున్న ప్రజలు..** వేసవికాలం రానే వచ్చేసింది దానికి తోడు ప్రజలు పండ్ల



రసాలతో ఆరోగ్యాన్ని ఉపశమనం చేసుకోవడానికి రకరకాల పండ్ల రసాలను తాగుతున్నారు. దీనికి తోడు పండ్ల రసాల అమ్మేవారు క్వాలిటీ తగ్గించి అధిక ధరలకు అమ్ముతున్నారు ఎందుకంటే నాలుగు రూపాయలు సంపాదించాలంటే ఈ వేసవి కాలంలోనే సంపాదించాలి అనే భావంతో వ్యాపారాలు చేస్తున్నారు.

**కొబ్బరి బొండాలకు యమ డిమాండ్...** వేసవికాలం దృష్టిలో పెట్టుకుని కొబ్బరికాయలు రేట్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిన్న మొన్నటి వరకు లీటర్ కొబ్బరినీళ్లు 70 రూపాయల నుండి 80 రూపాయలు వరకు ఉండగా నేడు అదే కొబ్బరినీళ్లు ఒక లీటర్ 100 నుంచి 110రూపాయల వరకు అమ్ముతున్నారు. కొబ్బరి నీళ్లు తాగేవారు వ్యాపారస్తుల్ని ఎందుకు రేట్లు పెరిగాయి అదగ్గా మండీ ల్లోనే రేట్లు పెరిగాయి సీజన్ వచ్చింది కాబట్టి రేట్లు పెరుగుతున్నాయి. అనే సమాధానం చెబుతున్నారు మామూలు కొబ్బరి బోండాన్ని 40 నుంచి 50 రూపాయల వరకు అమ్ముతున్నామని సమాధానం ఇస్తున్నారు

**ఏసీలు, కూలర్లపై రెట్లు పెంచుకుంటున్న డీలర్లు...**

ఎండాకాలం సీజన్ రానే వచ్చింది దానికి తోడు ప్రజలు చల్లదనాన్ని కోరుకుంటున్నారు. దీనికి అనుగుణంగా కూలర్లు, ఏసీలపై ఖర్చు పెట్టడానికి వెనక్కు తగ్గడం లేదు డబ్బులు ఖర్చయిన పర్వాలేదు ప్రశాంతంగా నిద్ర పోవాలి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అనే ఆలోచనలో ఉన్నారు.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు...** మొన్న మొన్నటి వరకు ఏ కుంటలో చూసిన ఏ చెరువులో చూసిన నీళ్లు సమృద్ధిగా ఉండేవి ప్రస్తుతం ఎండ తీవ్రతకు కుంటల్లో చెరువుల్లో నీరు కనిపించకుండా పోతుంది.



### నాగచైతన్య, సాయిపల్లవి ముఖ్యఅతిథులుగా

# ది నెక్ట్స్ సింగింగ్ యూత్ ఐకాన్, టైటిల్ గెలుచుకునేది ఎవరు?

**ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో**

**తిరుపతి, మేజర్‌న్యూస్:** తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించే జీ తెలుగు ఈ ఆదివారం మరింత వినోదం అందించేందుకు సిద్ధమైంది. ఆరంభం నుంచి మనసుని హత్తుకునే పాటలు, అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు పాపులర్ షో సరిగమప సీజన్ 16- ది నెక్ట్స్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ ఫినాలేకు చేరుకుంది. మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తూ అత్యంత ప్రేక్షకాదరణతో కొనసాగుతున్న సరిగమప 16 సీజన్ చివరి అంకానికి చేరుకుంది. నాగచైతన్య, సాయిపల్లవి ముఖ్య అతిథులుగా ఉత్కంఠగా సాగిన సరిగమప సీజన్ -16 ది నెక్ట్స్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ ఫినాలే, ఫిబ్రవరి 9 ఆదివారం సాయంత్రం 6 గంటలకు మీ జీ తెలుగులో. ఈ సీజన్కి ప్రముఖ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, ప్రముఖ సంగీత దర్శకుడు కోటి, గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్లో ఎంపికైన గాయనీగాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ మూడు జట్లుగా పోటీపడ్డారు. ఈ జట్లకు ప్రముఖ గాయకులు రేవంత్, రమ్య బెహర, అనుదీప్ దేవ్ మెంటర్లుగా వ్యవహరించారు. మెంటర్స్ మార్గదర్శ కత్వంలో సోలో, డ్యూయెట్, గ్రూప్ యాక్ట్స్ వంటి క్లిష్టమైన రౌండ్లను ఎదుర్కొని ఆరుగురు కంటెస్టెంట్స్ గ్రాండ్ ఫినాలేకు చేరుకున్నారు. ఆరంభం నుంచీ అద్భుతమైన ప్రదర్శన లతో రాణిస్తున్న సాత్విక్, మేఘన, వైష్ణవి, మోహన్, అభిజ్ఞ, మానస ఫినాలేకు చేరుకుని టైటిల్ బరిలో నిలిచారు. ఈ ఆరుగురు సరిగమప 16-ది నెక్ట్స్ సింగింగ్ యూత్ ఐకాన్ టైటిల్ కోసం పోటీపడనున్నారు. ఉత్కంఠగా సాగనున్న ఈ గ్రాండ్ ఫినాలేకు తండేల్ చిత్ర బృందం నుంచి హీరో నాగ చైతన్య, హీరోయిన్ సాయి పల్లవి, నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతేకాదు సీనియర్ నటి రాధ, హీరో విశ్వక్ సేన్ ఈ ఫినాలే ఎపిసోడ్కి హాజరై ఫైనలిస్టో ఉత్సాహం నింపారు. ప్రముఖ గాయని మంగ్లీ ప్రత్యేక ప్రదర్శన ఇవ్వగా, సీరియల్ నటులు నిసర్గ గౌడ, ప్రీతి శర్మ, అభినవ్, సంగీత, పృథ్వీ, సాయికిరణ్ హాజరై ఫైనలిస్టులకు తమ మద్దతు తెలిపారు. రసవత్తరంగా సాగే ఈ గ్రాండ్ ఫినాలేలో ఫైనలిస్టులు పలు మ్యూజికల్ రౌండ్లలో పోటీపడి ప్రేక్షకులను అలరిస్తారు. ఈ గ్రాండ్ ఫినాలేలో గెలిచిన కంటెస్టెంట్ సరిగమప 16-ది నెక్ట్సింగింగ్ యూత్ ఐకాన్ టైటిల్తోపాటు పదిలక్షల నగదుని కూడా గెలుచుకోనున్నారు. హోరాహోరీగా సాగే ఈ సంగీత సమరంలో నిలిచి గెలిచేదెవరో తెలుసుకోవాలంటే తప్పకుండా చూడండి సరిగమప 16- ది నెక్ట్సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ ఫినాలే మీ జీ తెలుగులో మాత్రమే.



## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిలాని భాషాకు సన్మానం

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని మొలకలపూడిలోని మెహర్‌ఆశ్రమంలో నాయుడుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం, మానవ హక్కుల పరిరక్షణ కమీషన్ జాతీయ అధ్యక్షులు షేక్ జిలానీ భాషాను సన్మానించారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ జయరాజు గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎన్.రామ్మోహన్‌రావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. పలువురు మాట్లాడుతూ సామాజిక సేవ, ప్రజాసమస్యల పరిష్కారం, పరిరక్షణతో పాటు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించిన జిలానీ భాషాకు సమాచార హక్కు చట్టం, మానవ హక్కుల పరిరక్షణ కమీషన్ జాతీయ అధ్యక్షులుగా సముచిత స్థానం దక్కిందన్న వారు జాతీయ స్థాయిలోనూ రాణించాలన్నారు. మెహర్ ఆశ్రమంలో నిరాశ్రయులైన వృద్ధులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ యాదవ్, కృష్ణారావు, హరిబాబు, మానమాల మోహన్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, ముని మోహన్ రెడ్డి, ప్రమీలమ్మ, మీనా పాల్గొన్నారు.



## నులి పురుగుల నివారణకు మందులు వాడాలి

**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణకు మందులు వాడాలని ఎంపీడీఓ అన్నపూర్ణరావు అన్నారు. శుక్రవారం వాకాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాఠశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బాలిరెడ్డిపాలెం వైద్యాధికారి డాక్టర్ రంగదీప్తి మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్నానం చేసి పరిశుభ్రంగా ఉండాలని, అదేవిధంగా ఆరోగ్య పరంగా ఎప్పటికప్పుడు వైద్య సేవలను గుర్తుంచుకోవాలన్నారు, ముఖ్యంగా పిల్లలందరూ తప్పనిసరిగా నులి పురుగులను తప్పనిసరిగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ రావు, తహసీల్దార్ రామయ్య, పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## టీ అంగళ్ళలో చాయ్ తాగిన ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం నాలుగు మాడవీధులను మహాశివరాత్రి ఏర్పాట్లను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలుగుదేశంపార్టీ నాయకులతో సరదాగా శ్రీకాళహస్తి పట్టణంలో పెళ్లి మండపం వద్ద టీ దుకాణంలో టీ తాగుతూ తనతో పాటు ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులకు, ప్రజలకు తేనేటి విందును అందజేశారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదంలో కార్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని టెంకాయతోపు 71వ జాతీయ రహదారి వద్ద చోటు చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదాన్ని పరశీలించారు.పోలీసులు కథనం మేరకు మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన మన్నాం వెంకటరత్నం (68) టెంకాయతోపు జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా శ్రీకాళహస్తి నుండి నాయుడుపేట వైపు వెళ్తున్న కార్ వేగంగా వచ్చి అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో మన్నాం వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.నాగరాజు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు కలరు.



## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దు : డీఎస్పీ

**గూడూరు, మేజర్‌న్యూస్:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని డీఎస్పీ గీతాకుమారి కోరారు. శుక్రవారం పట్టణ శివారు ప్రదేశాల్లో మద్యం ప్రియులు ఎక్కువగా ఉండే ప్రదేశా లను గుర్తించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఇలా చేయ డం వలన పర్యావరణానికి హాని కలిగించ డమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతుందని తెలిపారు. ఇలాంటి చోట్ల మద్యం సేవిస్తే స్థానికులు ఫిర్యాదు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.




# సీఎం, ఎమ్మెల్యే, కలెక్టర్ చిత్రపటాలకు పాలాభిషేకం

### క్రిస్ సిటీ కంపినీ వల్ల భూములు కోల్పోయిన రైతులకు పరిహారం నిర్ణయించిన ప్రభుత్వం

**వాకాడు/కోట, మేజర్‌న్యూస్:** కోట మండలం కొత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో క్రిష్ సిటీ కంపినీకి సంబందించిన సాగు రైతులకు జరిగిన రాష్ట్ర కేబునెట్ మీటింగ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన భూమి నష్ట పరిహారం ఎకరాకు ఎనిమిది లక్షలు ప్రకటించడం జరిగింది. దీంతో కొత్తపట్నం పంచాయతీ ప్రజలు, రైతులు హర్షం తెలియ జేశారు. ఈ సందర్బంగా శుక్రవారం గున్నంపడియ గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ కి మరియు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ కు ధన్యవాదములు తెలుపుతూ సాగు రైతులు కొమారి వెంకయ్య అధ్యర్యంలో వాటంబేటి చెంగల రావు, కోమారి శివకృష్ణ, చల్లా సురేష్, ఉమ్మడి కృష్ణ వేణయ్య,ఉమ్మడి రాజా, కావలి అనోక్, కుమారి రామయ్య, కల్తిరెడ్డి పెద్ద రమణయ్య, తాత వెంకటయ్య, నడవల వేంకటేశ్వర్లు, కుమారి భాస్కర్, ఇనుగుంట వెంకటసుబ్బయ్య, ఇంగిలాల వెంకటరమణయ్య, మరియు సాగు రైతులు పాల్గొని హర్షం వ్యక్తం చేస్తూ సాగు రైతులు తరుపున పాలాభిషేకం చేయడం జరిగింది.



## మఠం గిరి నుండి మాకు రక్షణ కల్పించండి

### బాధితురాలు భాగ్యలక్ష్మి వేడుకోలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో హాథీరాంజీ మఠం భూములను సైతం కబ్జా చేసిన గిరిధర్ మురారి అలియాస్ మఠం గిరి అనే భూకబ్జా దారుడు తమ భూమిని సైతం కబ్జా చేసి,అందులో దౌర్జన్యంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నాడని చంద్రగిరికి చెందిన ఆర్.భాగ్యలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె తన భర్త చంద్రశేఖర్‌తో కలిసి తన గోడును విన్నవించుకున్నారు. ఆమె మాట్లాడుతూ రేణిగుంట మండలం, కొత్తపాలెం గ్రామం లెక్క దాఖలా, సర్వే నెంబర్ 104/1ఏ, 104/5ఏలో కలిపి మొత్తం 3.86 ఎకరాల భూమికి 2002 లో అప్పటి రెవెన్యూ అధికారులు తమ పేరిట పట్టా ఇచ్చారని తెలిపారు. అప్పటి నుండి తామే ఆ భూమిని అనుభవిస్తున్నామని తెలిపారు.కానీ కొంతకాలం తర్వాత సదరు భూమిని రెవెన్యూ అధికారులు అనాదీనం కింద మార్చారని తెలిపారు. తాను ఈ విషయంపై రాష్ట్ర హైకోర్టు నందు కేసు వేయగా, తమకు స్టేటస్ కో ఆర్డర్ వచ్చిందని తెలిపారు. అయితే తిరుపతికి చెందిన మఠం గిరి, కన్నలి మోహన్ రెడ్డి, కుర్రకాలువ నాగరాజులు కలిసి తమ భూమిలోకి జొరబడి కబ్జా చేశారని ఆరోపించారు. తాజాగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై రేణిగుంట తహసీల్దార్ ను సంప్రదించగా, సదరు మఠం గిరికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, తేల్చి చెప్పారు. ఇంత జరుగుతున్నా తమకు పోలీస్ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ మాకు న్యాయం చేయలేదని ఆవేదన చెందారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, శంకరయ్య, వెంకట రమణలు పాల్గొన్నారు.




## సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** రామచంద్రపురం మండలంలోని వెంకటరామపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఏ, జీ, ఎస్, హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సెవెన్ హిల్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన 44మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఏడాదికి మూడు లక్షలు వేతనంగా లభిస్తుందన్నారు. ఏ, జి, ఎస్, హెల్త్ ప్రతినిధులు రాజేష్ అయ్యా, శివసాయికళ్యాణ్, సందీప్‌లు విద్యార్థులను, రాత, మౌలికపరీక్షలు నిర్వహించి విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎం.సుమలత, బోధన సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆర్టీసీలో న్యాయ విజ్ఞాన సదస్సు

**గూడూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఆర్టీసీ డిపోలో జిల్లా జడ్జ షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, పౌర హక్కులకు ఎవరూ భంగం కలిగించకూడదని, సమాజంలో అందరితోనూ ఐకమత్యంగా కలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ బి.రాజేష్, బార్ ప్రెసిడెంట్ భాస్కర్‌రావు, అడ్వకేట్లు పార్వతయ్య, మహబూబ్ బాషా, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




# వైకాపా సీనియర్ నాయకులు సుబ్బరాఘవ రెడ్డి మృతి

### పలువురు సంతాపం
### మంచి నాయకుడిని కోల్పోయాం
### స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** చిట్టమూరు మండలం ఆరూరుకు చెందిన వైయస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దేవారెడ్డి సుబ్బ రాఘవ రెడ్డి(70) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. స్థానికులు, బంధువుల వివరాల మేరకు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ,వైయస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగ మురళీధర్ సుబ్బరాఘవ రెడ్డి భౌతికఖాయానికి పూలమాలు వేసి నివాళులర్పించి మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపిన మేరుగ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రాజకీయాలలో తొలితరం మండలస్థాయి నాయకుడిగా పేరొంది, గుర్తింపుతెచ్చుకుని, రాణించి, విలువలు, విశ్వసనీయతకు పెట్టింది పేరుగా రాజకీయాలలో సుబ్బరాఘవ రెడ్డి ప్రసిద్ధి చెందారు. నాడు తెలుగు దేశం పార్టీ కంచుకోటగా ఉన్న ఆరూరులో కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా సమస్యలకు ఎదురొడ్డి నిలబడ్డారు. రాజకీయ పరిణామక్రమంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవడంతో వైయస్సార్‌సీపీలో చేరిన తన వారసుడు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డిని ఆరూరులో ఎదురులేని నాయకుడిగా ఎదిగేలా తెరవెనకుండి నడిపించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోనూ ఆరూరు పంచాయితీలో కోడలు దేవారెడ్డి సంధ్యారాణిని సర్పంచ్‌గా గెలిపించుకుని తిరుగులేని నాయకత్వానికి చిరునామాగా చరిత్రకెక్కారు. నమ్ముకున్న వారికి అండగా, పేదల పక్షపాతిగా, వైయస్ఆర్ అభిమానిగా, తొలితరం మండలస్థాయి నాయకుల్లో ప్రముఖుడిగా పేరొందిన దేవారెడ్డి సుబ్బారాఘవ రెడ్డి మరణం తీరనిలోటన్న వైయస్సార్‌సిపి నాయకులు, ప్రముఖులు, పార్టీలకతీతంగా పలువురు నాయకులు ఆయన భౌతిక ఖాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం, కుటుంబానికి సానుభూతి తెలిపారు.





# జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయండి

## – కమిషనర్ నరసింహ ప్రసాద్

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్:** నగర పాలక పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, జూనియర్ కళాశాలలో ఈనెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆల్బెండజోల్ మాత్రలను పాఠశాల హెచ్ఎంకు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పిల్లలు శారీరకంగా, మానసిక ఎదుగుదలకు నులిపురుగుల నిర్మూలన ఎంతో అవసరమన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను తినిపించాలన్నారు. 10వ తేదీ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోనివారికి 17వ తేదీన ఇవ్వాలన్నారు. అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా. లోకేష్, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, హెచ్ఎం పూర్విక, ఇంచార్జ్ సెంటర్ ఇన్స్పెక్టర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ఆదర్శనీయుడు ముద్దుకృష్ణమనాయుడు

## నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** ఆదర్శనీయుడు దివంగత మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు అని నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కొనియాడారు. శుక్రవారం ముద్దు కృష్ణమ నాయుడు ఏడవ వర్ధంతిని పురస్కరించుకొని వెంకటరామపురం గ్రామంలోని ముద్దుకృష్ణమ నాయుడు సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలోని కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు దుప్పట్లు దిండు కవర్లను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జావీద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేసిన గొప్ప నాయకుడు తన తండ్రి ముద్దుకృష్ణమనాయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి చిన్నబాబు, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు రజనీకాంత్, మాజీ ఎంపీటీసీ సురేష్, మధు, మునిరత్నం నాయుడు, పాలడుగు చంద్రశేఖర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మహాశివరాత్రి ఉత్సవాలు

# అత్యంత వైభవంగా నిర్వహిద్దాం

## - ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి





**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగ సుందరంగా ముస్తాబు అవుతుంది. ముక్కంటి ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలు కొత్త రంగులతో కళకళ లాడుతున్నాయి. భక్త కన్నప్ప, రామసేతు వంతెనలు పైనా, పట్టణ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకులు పచ్చతోరణాలు, కాషాయ రంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి. భక్తుల కోసం ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరిశీలించారు.. ఈ మహాశివరాత్రి అత్యంత వేడుకగా నిర్వహించాలంటు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్యూలైన్ లలో ఎక్కడ భక్తులు ఇబ్బంది పడకూడదని భక్తిపర్యవైశ్యమైన వాతావరణంలో భక్తులు స్వామి అమ్మవారిని దర్శించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..ఈ పర్యాయం మహాశివరాత్రి వేడుకలు అత్యంత వేడుకగా కళాత్మకంగా. భక్తి పార్వస్యమైన వాతావరణంలో ఓంకార నామస్మరణలతో అత్యంత వేడుకగా నిర్వహించడానికి కార్యాచరణ చేపడుతున్నామని. ఆలయంలో ఇప్పటికే ఉత్సవ మూర్తులకు ఊరేగించే విగ్రహాలకు. ఆలయంలో వివిధ విగ్రహాలకు రంగులతో రంగవల్లులుగా తీర్చిదిద్దుతున్నారని. ఎల్ఈడి లైట్లతో మరింత తేజోమయంగా శ్రీకాళహస్తి క్షేత్రం విరజిల్లేటట్లు కార్యాచరణ చేపట్టనున్నామని ,రానున్న మహాశివరాత్రి వేడుకలు ఎన్నడు కనివిని ఎరుగని రీతిలో నభూతో నభవిష్యత్ అన్న రీతిలో నిర్వహించేందుకు కార్యచరణ చేపడుతున్నామని తెలియజేశారు.

# శ్రీ రాజశ్యామలా దేవి నవరాత్రులు మహా పూర్ణాహుతి

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** రాయలచెరువు శ్రీ శక్తి పీఠంలో శ్రీ రాజశ్యామలా దేవి నవరాత్రులలో చివరి రోజు కుర్తాళం సిద్దేశ్వరి పీఠం పీఠాధిపతులు శ్రీ శక్తి పీఠ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి భక్తులకు దర్శనం ఇచ్చి ఆశీర్వాదం చేశారు. మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతజీ శ్రీ శ్రీ శ్రీ రమ్యానందభారతీ స్వామినీ వారి దివ్య సమక్షంలో దేవికి పంచామృత అభిషేకం ఘనంగా నిర్వహించారు. తదుపరి శ్రీ రాజశ్యామలా దేవికి 108 సుగంధ ద్రవ్యాలతో హోమం అనంతరం మహా పూర్ణాహుతి జరిగినది. స్త్రీ మూర్తులకు సువాసినీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శక్తి పీఠం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ కాలువలపై

# అక్రమ కట్టడాలను తొలగించండి : ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** పట్టణంలోని నాలుగు మాడవీధులలో పురపాలక సంఘం, కాలువ. కాలువ వెలుపల రహదారిని ఆక్రమించుకొని కట్టడాలును కట్టుకున్న దుకాణదారులు ఆ కట్టడాలను తొలగించవలసిందిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి. రెవిన్యూ పురపాలక సంఘం అధికారులతో కలిసి దుకాణదారులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి దుకాణానికి ఆయనే స్వయంగా వెళ్లి దుకాణదారులను అభ్యర్థించారు. రానున్న మహాశివరాత్రి దృష్ట్యా శ్రీకాళహస్తి పట్టణంలో



ట్రాఫిక్ జామ్ జరగకుండా మున్సిపాలిటీ కాలువపై మునిసిపాలిటీ కాలువ వెలుపల రోడ్డుపై ఆక్రమించి కట్టుకున్న కట్టడాలను తొలగించవలసిందిగా ఆయన దుకాణదారులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జలసుధీర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న మహాశివరాత్రి దృష్ట్యా ఎక్కడ పట్టణంలో ట్రాఫిక్ జామ్ సమస్యలు లేకుండా నివారించడానికి, శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు మాడవీధులలో మున్సిపల్ కాలువ పైన, మున్సిపల్ కాలువ వెలుపల నిర్మాణాలు కట్టుకున్న దుకాణదారులను వాటిని తొలగించవలసిందిగా తానే స్వయంగా దుకాణదారులను అభ్యర్థించానని తెలియజేశారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఎక్కడ నష్టపోకూడదనే ఉద్దేశంతో తానే స్వయంగా ప్రతి ఒక్క దుకాణానికి వెళ్లి కట్టడాలను కొంచెం వెనక్కి తగ్గించి కట్టుకుంటే తద్వారా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఉండవని దుకాణదారులకు తెలియజేశామన్నారు, ఈరహదారులు ఇరుకుగా ఉండడంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో జరిగే రథోత్సవంలో, రథాన్నిలాగే భక్తులు కొద్దిపాటి ఇబ్బందులు గురివుతున్నారని. ఆ ఇబ్బందులు తొలగించడానికి శ్రీకాళహస్తి పట్టణంలో రహదారులను విశాలంగా ఏర్పాటు చేస్తే, మహాశివరాత్రి వేడుకలు కూడా అత్యంత బ్రహ్మాండంగా నిర్వహించని తెలియజేశారు.

# స్మార్ట్ సిటీలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

## – స్మార్ట్ సిటీ ఎం.డి. ఎన్.మౌర్య



**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, ప్రాజెక్టుల ప్రతినిధులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ లో భాగంగా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆయా ప్రాజెక్టుల్లో పెండింగ్ లో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. గరుడ వారధిలో కూడళ్లు, డివైడర్లు, గోడల సుందరీకరణ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టి లెవెల్ కార్ పార్కింగ్, తదితర ప్రాజెక్టులు సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు చంద్రశేఖర్, శ్యాంసుందర్, డిఈలు రాజు, మహేష్, మధు, ప్రసాద్, ఏ.ఓ. రాజశేఖర్, సి.ఎఫ్.ఓ. మల్లికార్జున, ఏఈకాం ప్రతినిధులు బాలాజి, అనిల్, అఫ్కాన్స్ ప్రతినిధి స్వామి, ఐ ట్రిపుల్ సి, మల్టి లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టుల ప్రతినిధులు ఉన్నారు.

# ఉత్తమ ఎస్ఐకు ఎమ్మెల్యే సన్మానం..

**బిఎన్ కండ్రిగ మేజర్‌న్యూస్:** 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన వేడుకలలో భాగంగా జిల్లాలో పలువురు ఎస్ఐలను ఉత్తమ ఎస్సైలుగా ఎంపిక చేసి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రశంసా పత్రం ఇవ్వడం జరిగింది.ఇందులో భాగంగా బుచ్చి నాయుడు కండ్రిగ స్థానిక ఎస్సైగా పనిచేస్తున్న విశ్వనాథ నాయుడుకి ఉత్తమ ఎస్ఐగా అవార్డు రావడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎస్సై విశ్వనాథ నాయుడుకి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వనాథ నాయుడు కి ఉత్తమ ఎస్సై ప్రశంసా పత్రం రావడం చాలా సంతోషంగా ఉందని. ఆయన ఇలాంటి అవార్డులు మరెన్నో పొందాలని కోరుకున్నారు. అలాగే మండలంలో శాంతిభద్రతలు పటిష్టం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కందేరి కార్తీక్ నాయుడు, రామనాథం, కుమార్, భాస్కర్ ఇతర నాయకులు పాల్గొన్నారు



# తిరుమల కొండపై దంపతుల ఆత్మహత్య

**తిరుమల మేజర్‌న్యూస్:** తిరుమలలో నందకం అతిథి గృహంలోని గది నెంబర్ 203లో దంపతులు ఫ్యాన్ కు ఉరేసుకొని చనిపోయారు .తిరుపతిలోని అబ్బన్న కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు నాయుడు , అరుణ ఆత్మహత్య చేసుకున్నారు .శ్రీనివాసులు నాయుడు హెడ్ కానిస్టేబుల్‌గా రిటైర్ అయ్యారు. ఆత్మహత్యకు కారణాలు ఏంటి అనే దానిపై ప్రస్తుతం పోలీసులు విచారిస్తున్నారు.






## బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టా రీత్యా నేరం

**– శ్రీకాళహస్తి మండల న్యాయ అధికారిక సంఘం**

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్:** బాల కార్మిక రహితంగా శ్రీకాళహస్తిని తీర్చిదిద్దేందుకు నేడు 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాలు మేరకు మండల న్యాయ సేవ అధికారక సంఘం ఆధ్వర్యంలో న్యాయవాది గుమ్మళ్ళ రాజేశ్వరరావు. అరుణ్ ఆధ్వర్యంలో పి.ఎల్.విలు శ్రీకాళహస్తి పట్టణం దుకాణాలను పరిశీలించారు. బాల కార్మికులను పనులో పెట్టుకోకూడదు దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో 12వ జిల్లా అదనపు జడ్జి ఆదేశాల మేరకు నేడు బాల కార్మికుల చట్టాలను దుకాణదారులకు అవగాహన కల్పించామని, షాపుల యజమానులకు 14 సంవత్సరాలు లోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవద్దని సూచించామని. ఎవరైనా పనిలో పెట్టుకుంటే



వారి షాపులు ప్రభుత్వ అధికారులు లైసెన్స్ రద్దు చేస్తారని, అంతే కాకుండా జైలు శిక్ష లేదా జరిమానా విధించబడుతుందని అవగాహన కల్పించామని తెలియజేశారు.

## డీ వార్మింగ్ డేని విజయవంతం చేయండి



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్: ఈనెల** 10వ తేదీ జరిగే నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ మురళి, రాయలపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ నందిని కోరారు. డి వార్మింగ్ డే విజయవంతం కోసం టాక్స్ ఫోర్స్ కమిటీ సమావేశం స్థానిక పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారికి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల లో విద్యార్థులకు, బడి బయట ఉన్న పిల్లలకు కూడా తప్పనిసరిగా నులి పురుగుల నిర్మూలన నిమిత్తం ప్రభుత్వం వారు అందజేస్తున్న మాత్రలను తప్పనిసరిగా అందజేయాలన్నారు. పెద్దపంజాణి ఎంపిపి రెడ్డప్ప ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించి, మాత్రల పంపిణీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి, మండల ప్రజా పరిషత్ ఏవో భాస్కర్, కార్యాలయ సిబ్బంది రాజశేఖర్, గజేంద్ర, నాగరాజు, ఎంసీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



**గుడిపాల, మేజర్‌న్యూస్:** గుడిపాల మండల ఇన్చార్జి తహసీల్దార్ జయంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుడిపాల తహసీల్దార్ పనిచేస్తున్న చంద్రశేఖరెడ్డిని ఇటీవల చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలోయాదమరి రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయంతిని గుడిపాలకు ఇన్చార్జిగా వేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్‌కు ఆరుగురు ఎంపిక

**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాలప్ప ఆసుపత్రి(దేవరజ్ ఆర్స్ వైద్య కళాశాల)కోలారు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరంలో మొత్తం పది కేసులు పరీక్షలు చేయగా అందులో ఆరు కేసులు ఎంపిక చేశామని, ఉచిత ఆపరేషన్, ఫాలో ఆప్, ఉచితంగా మందులు ఇవ్వబడునని డాక్టర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రచన, కంటి వైద్య నిపుణులు, డాక్టర్ పవన్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,జాలప్ప ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీచైతన్యలో క్రీడా దినోత్సవం

**తొట్టంబేడు, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణ శివారులో ధర్మరాజస్వామి ఆలయం సమీపంలో గల శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిరోషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు పంచాయతీలో నూతన తాగునీటి బోరు

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** తొట్టంబేడు పంచాయతీ కొర్లగుంట హరిజనవాడ ప్రజలకు తాగునీటి సమస్య ఉందని తెలు సుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వెంటనే తాగునీటి బోరు సౌకర్యం కల్పిం చాలని అధికారులకు నాయకు లకు తెలిపారు. సర్పంచ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు తాగునీరు బోరు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీమాల. భాస్కర్ ముదిరాజ్, చిల్లకూరు బాలసుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్‌ఏఈ గౌరీ ప్రియ,పంచాయతీ సెక్రెటరీ హరిప్రియ గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## హత్యాయత్నం కేసులో ఐదు సంవత్సరాల జైలు శిక్ష

**చిత్తూరుక్రైమ్ మేజర్‌న్యూస్:** హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ చిత్తూరు ప్రిన్సిపాల్ సీనియర్ కోర్ట్ జడ్జ్ ఎం.వి.ఎన్.పద్మజ శుక్రవారం తీర్పునిచ్చారు. 2022వ సం. లో చిత్తూరు జిల్లా బంగారు పాల్యం మండలం టేకుమంద గ్రామంలో ముగ్గురు వ్యక్తుల పై హత్యాయత్నం చేసిన ముద్దాయిలు శ్రావణ్ కుమార్ 30 సం, సుబ్రహ్మణ్యం 55 సం, కు 5 సం. జైలు శిక్ష 5000రూ.ల జరిమానా విధించిన చిత్తూరు ప్రిన్సిపాల్ సీనియర్ కోర్ట్ జడ్జ్ ఎం.వి.ఎన్.పద్మజ తీర్పునిచ్చారు. పోలీసులు నమోదు చేసిన కేసు వివరాల మేరకు చిత్తూరు జిల్లా, బంగారుపాలెం మండలం, టేకుమంద గ్రామానికి చెందిన ముద్దాయి శ్రావణ్ కుమార్, సురేంద్ర చెల్లెలిని తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వాలంటీర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న శ్రావణ్ కుమార్, మద్యం అలవాటుకు బానిసై భార్యను తరచూ హింసించేవాడు. భార్య ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు కొన్ని రోజుల పాటు సహనం పాటించమని సూచించారు. కాగా, 2022 సంవత్సరం జూలై 18 వ తేదీన సురేంద్ర తన కొడుకు, మామ గంగులప్పతో కలిసి ముద్దాయి ఇంటికి వెళ్లి వివాదంపై ప్రశ్నించగా, ఆగ్రహంతో ముద్దాయిలు శ్రావణ్ కుమార్, సుబ్రహ్మణ్యం కలిసి వారిపై కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో గంగులప్ప, సురేంద్ర కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. సురేంద్ర కూడా ఈ దాడిలో గాయపడి, అందరినీ తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంగారుపాలెం ఎస్.ఐ. మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేసి, ఐపీసీ సెక్షన్ 307, 326 కింద కేసు దర్యాప్తును ప్రారంభించారు. ఈ దర్యాప్తులో భాగంగా, ఘటనాస్థలాన్ని పరిశీలించి, నిందితులు



ఉపయోగించిన కత్తి, రక్తంతో ఉన్న బట్టలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, 2022 సంవత్సరం జూలై 21వ తేదీన న అందిన సమాచారం మేరకు బంగారుపాలెం మండలం, బలిజపల్లి బస్టాండ్ వద్ద ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. విచారణ పూర్తి కావడంతో శుక్రవారం చిత్తూరు ప్రిన్సిపాల్ సీనియర్ కోర్టు జడ్జి ఎంవిఎన్.పద్మజ తీర్పు వెలువరించారు. ఈ తీర్పు ప్రకారం, నిందితులు శ్రావణ్ కుమార్ సుబ్రహ్మణ్యం కు 5 సం. జైలు శిక్షతో పాటు రూ.5000 జరిమానా విధించారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడుటకు కృషి చేసిన బంగారుపాలెం ఎస్.ఐ. శ్రీ మల్లికార్జున రెడ్డి, కోర్టుకు సాక్షాలను సకాలంలో హాజరు పరచిన కోర్ట్ కానిస్టేబుల్ కార్తీక, కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందిని చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు ప్రత్యేకంగా అభినందించారు.

## రహదారి నిబంధనలకు ప్రజలు పోలీసులకు సహకరించాలి

**– శ్రీకాళహస్తి డిఎస్పి కే నరసింహమూర్తి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి నరసింహమూర్తి విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ.. ప్రజలు శాంతి యుతంగా జీవనం సాగించేందుకు. నూతన రూపకల్పన ప్రారంభించామని, ఆకతాయి చేష్టలను నిర్మూలించడానికి, ఎస్పీ ఆదేశాల మేరకు



నూతన ప్రణాళిక చేపట్టామని, రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై సంచరించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ,యువత ఎక్కువగా ఎటువంటి పనులు లేకపోయినా, రాత్రి పూట నగరంలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై అతివేగంగా వెళుతున్నారని. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు, మద్యం సేవించి వాహనాలు నడిపే వ్యక్తులపై పోలీసులు ఎక్కువగా దృష్టి సారించి ఉన్నామని, మద్యం తాగి వాహనాలలో సంచరించే వ్యక్తులను అరెస్టు చేస్తామని తెలియజేశారు. ప్రజలు అత్యవసర పరిస్థితిలో తప్ప రాత్రిపూట సంచరించకూడదని ప్రజలను కోరారు. రానున్నది వేసవి కాలం కాబట్టి ప్రజలు ఆరుబయట నిద్రించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వేసవికాలంలో ఎక్కువగా దొంగతనాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి. ప్రజలు అప్రమత్తంగా ఉండి వారి వారి నగదును సంరక్షించుకోవాలని కోరారు. ప్రజలు శాంతియుతంగా జీవించడానికి ఈ కార్యాచరణ చేపడుతున్నామని ,ప్రజలు పోలీసులకు సహకరించవలసిందిగా కోరారు.

## గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**తడ, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పులివేంద్ర క్రాస్ రోడ్డు వద్ద పద్మావతి విద్యాలయ సమీపంలో జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా వెళుతూ ఈనెల



4వ తేదీన చెన్నైకి చెందిన రావి నూతల శీనయ్య (60) స్కూర్ వస్తూ అదుపుతప్పి డివైడర్ పై పడి తలకు, వెన్నుముకకు, కుడి భుజానికి గాయాలై స్పృహ తప్పి పడిపోవడంతో అటుగా వెళుతున్న వారు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి సులూరుపేట ప్రభుత్వాసుపత్రికి చేర్పించగా అక్కడ ప్రథమ చేసి వారి కుటుంబ సభ్యులకు తెలియపరచడంతో వెంటనే వారు మెరుగైన వైద్యం కోసం చెన్నై కేయంసి హాస్పిటల్ కు తీసుకెళ్లి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో మృతి చెందిన సీనయ్య భార్య దొరసానమ్మ తడ పోలీసులకు సమాచారం తెలపడంతో శీనయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం తడ పోలీసులు చెన్నై కేఎంసీ ఆసుపత్రికి చేరుకొని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్ప గించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే కొండప నాయుడు తెలిపారు.

## అదుపు తప్పి బోల్తా పడిన ఆటో

**– ఇద్దరికి గాయాలు**



**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండలంలోని చారాల వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది.అందులో ప్రయాణిస్తున్న బంగారుపాళ్యంకు చెందిన మనోహర్ కుమార్తె భానుప్రియ(10), అఖిల్(8)తీవ్రగాయాలయ్యాయి. ఆటో బంగారుపాళ్యం నుండి తరిగొండకు వెళ్తున్నట్లు సమాచారం,ప్రమాదం లో గాయపడిన క్షతగాత్రులను 108 సిబ్బంది గణేష్, ప్రసాద్ లు చౌడేపల్లి ప్రాథమిక ఆసుపత్రి కి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్త మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

**గుడిపాల,మేజర్ న్యూస్:** గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నందు వైద్య అధికారి సంధ్య, చంద్ర మహేష్ , డాక్టర్ అనూష, డాక్టర్ రశ్మిత, బొమ్మశముద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుడి పాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు, ఈనెల 10,వ తేదీన జరగబోయే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి ఆల్బెం డజోల్, మాత్రలు, కరపత్రాలు, వాల్ పోస్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు పంపిణీ చేశారు. మండల స్థాయి అధికారులు శివరాజ్, ఎంపిడిఓ గణపతి, ఎంఇఓ, ఎంపీడీవో ఆఫీస్ నందు ఆల్బెండజోల్, మాత్రలు, టీచర్లకు వైద్య సిబ్బందికి ఇవ్వడం జరిగింది. పోస్టర్లను, ఆవిష్కరించబడినది, ఎంపీడీవో మాట్లాడుతూ, 10, తేదిన సోమవారం గుడిపాల మండలానికి సంబంధించిన బొమ్మసంద్రం, 2716 పిల్లలు గుడిపాలలో ఉన్న 3253 పిల్లలకు ప్రతి పాఠశాల నందు తప్పకుండా వేయాలని, ఈ కార్యక్రమం జయప్రదంగా జరిపించాలని, ప్రతి పిల్లలకి మధ్యాహ్నం భోజనం తర్వాత మింగించాలని వైద్య సిబ్బంద లకు సూచించారు పిల్లలకి ఏ టువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తగా కిట్ ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంచుకోవాలని సూచనలు ఇచ్చారు ఎంఈఓ మాట్లాడుతూ మా టీచర్ లందరికీ ఈ కార్యక్రమం గురించి తెలపడం జరిగినది, మనమందరం ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా జరపవలసిందిగా తెలియజేస్తున్నాను అని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, డాక్టర్ సంధ్య, డాక్టర్ అనూష, డాక్టర్ చంద్ర మహేష్, భానుమూర్తి, విజయ, చంద్రశేఖర్, అనురాధ, రుక్మని, శశి, తదితరులు పాల్గొన్నారు.



# సదుంలో వడ్డెర సంఘం ఏకగ్రీవం



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలోని సదుం మండలంలో శుక్రవారం నియోజకవర్గ వడ్డెర సంఘ అధ్యక్షులు సుబ్రమణ్యం ఉపాధ్య క్షులు రమేష్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘం ఎన్ని కలు సదుంమండలంలోని రెడ్డివారి పల్లి గ్రా మంలో జరిగాయి మండల అధ్యక్షుడిగా జెరా జా రెడ్డివారి పల్లి ఉపాధ్యక్షులుగా సుధాకర్ రవి ప్రధాన కార్యదర్శిగా నాగరాజు కార్యదర్శిగా వెంకట రామయ్య కోశాధికారిగా రవి కార్యవర్గ సభ్యులుగా ఎం రెడ్డమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘ పుంగనూరు మండల అధ్యక్షుడు ఆర్ సి వెంకటరమణ చౌడేపల్లి ఉపాధ్యక్షులు డి జయ కుమార్ కార్యవర్గ సభ్యులు డి పరమేశ్వర్, శ్రీనప్ప సోమల వడ్డెర సంఘ కార్యదర్శి సి వెంకటరమణ పెద్ద సంఖ్యలో వడ్డెర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పరికరాలతో విద్యార్థుల్లో మార్పు తీసుకురావాలి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** తాము విద్యార్థు లకు అందించిన పరికరాలు విద్యార్థుల జీవి తాల్లో మార్పులు తీసుకురావాలని ఇన్ఫినిటీ పిన్ కార్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి శ్రీకాంత్ రవల్కర్ అన్నారు. శుక్రవారం వెదు రుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గృహ రుణముల కంపెనీ ద్వారా విద్యార్థులకు పరికరాలను అందజేశారు. విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, జామెంట్రీ బాక్స్, రెండు బీరువాలు, 20 కుర్చీలు, సౌండ్ సిస్టం ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాఠశాలకు లక్ష రూపాయలు విలువ గల పరికరాలను అందించిన కంపెనీ ఎండిని అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ మోహన్, సభ్యులు శివ, మురళి, వినాయక రెడ్డి, గోపి, లోకేష్ దామోదర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణాధి కారి డాక్టర్ వెంకటప్రసాద్ పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్ సి లోని అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మూడు కుష్టు వ్యాధి మూలాలు కలిగి వున్న వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య కేంద్ర వైద్యాధికారి టి మురళి, డిపిఎమ్ఓలు దేవదాసు, జాన్ పాల్గొన్నారు.

# పద్మ సరస్సు గిరిజన కాలనీలో పారిశుద్ధ్యం పనులు

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** పద్మ సరస్సు గిరిజన కాలనీలో ఉన్న మురికి కాలువలు, పారిశు



ధ్య పనులు, చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిలో ఉన్న పేడ దెబ్బలను సర్పంచ్ ధనుంజయ వర్మ, ఈవో నాగరత్నమ్మ ఆధ్వ ర్యంలో తొలగించారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ నిర్వ హించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వీధి దీపాలు వెలగనివి మరమ్మత్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నాగాలమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియని శవం



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** చిత్తూర్– పుత్తూరు జాతీయ రహదారి నాగాలమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని శవం ఉండ డంతో రహదారుల వెళ్తున్న వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. కార్వేటినగరం మండల ఆర్ కె వి బి పేట గ్రామం పుత్తూరు చిత్తూరు జాతీయ రహదారి వున్న నాగాలమ్మ గుడి సమీపంలో ఎవరో ఒక గుర్తు తెలియని వ్యక్తి శవం, నోట్లో నుండి బురుగ వస్తుంది, ఏదో విషం తీసుకున్నట్లు అనుమానాలు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్న కార్వేటి నగరం పోలీసులు తెలిపారు.

# మా తెలుగు ఉపాధ్యాయుడు మాకు కావాలి

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మా తెలుగు ఉపాధ్యాయుడు తొండు కృష్ణయ్య మాకు కావాలని ఏఐ ఎస్ఎఫ్ నేతలు డిమాండు చేశారు. మండలంలోని ఎగువ సాంబయ్యపాళెం ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం ఏఐఎస్ఎఫ్ నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నేతలు మాట్లాడుతూ ఎగువ సాంబయ్యపాలెం ఉన్నత పాఠశాలలో తొండు కృష్ణయ్య ఐదేళ్లుగా తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారన్నారు. అదే పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఓ బాలిక తనతో అసభ్యంగా మాట్లాడారని తొండు కృష్ణయ్యపై తప్పుడు ప్రచారం చేసింద న్నారు. దీంతో తొండు కృష్ణయ్యను జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండు చేశారన్నారు. సస్పెండ్ కు గురైన కృష్ణయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నేతలు డిమాండు చేశారు. కార్యక్ర మంలో తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూతన వధూవరలను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన స్థానిక టీడీపీ నాయకులు శిరసనంభేటీ ప్రసాద్ రెడ్డి కుమార్తె వివాహానికి సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డా.నెలవల విజయ శ్రీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం భేటీ విజయ భాస్కర్ రెడ్డి, సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పసల గంగా ప్రసాద్, రాష్ట్ర సర్పంచ్ ల సంఘం కార్యానిర్వాహక కార్యదర్శి దేవా రెడ్డి నాగేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమం విజయవంతం చేయండి

## – బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ వార్షిక పరీక్షలకు మునువు విద్యార్థులతో నిర్వహించే పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 10వ తారీఖున నిర్వహించనున్నట్లు బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ లోని సుందర్ నర్సరీ పార్కులో 35 మంది విద్యార్థులతో విశిష్ట అతిథులతో మోడీ పరీక్ష పే కార్యక్రమంలో భాగంగా ముఖాముఖిగా చర్చించనున్నారని విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని తట్టుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఈ పరీక్ష పే చర్చ కార్యక్రమం ఉంటుందని,ఈ కార్యక్రమం దూరదర్శన్ ఇతర సోషల్ మీడియా ఛానల్స్ లో పదవ తేదీ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుందని తెలిపారు. చిత్తూరు జిల్లా లోని ప్రతి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో టీవీల ద్వారా వీక్షించవలసినదిగా, క్షేత్రస్థాయి అధికారులకు ఉన్నత పాఠశాల ప్రధాప్రధానోపాధ్యాయులకు తగిన ఆదేశాలు ఇవ్వవలసిందిగా జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలసి వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు.

# టీడీపీ మహిళ నేత పులివర్తి సుధా రెడ్డి మహిళలతో ముఖాముఖి

**పాకాల, మేజర్‌న్యూస్:** మండలంలోని గాదంకి, శంఖంపల్లి, నేంద్ర గుంట పంచాయతీలలో మహిళలతో ముఖా ముఖి కార్యక్రమం టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి,స్థానిక మహిళ నాయకురాళ్ళు సమ క్షంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా పులివర్తి సుధా రెడ్డికి మహిళలు, స్థానికులు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనం తరం నేతలు శ్యాలువా కప్పి సన్మానించారు. కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన వెంటనే ఆరు మాసాలలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సొంత మండలం, పాకాల మండలంలో జరిగిన జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేశారు. పంచాయతీల లోని సమస్యలను మహిళలను అడిగి తెలుసుకొని, తక్షణమే సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతి పదికన పరిష్కారమయ్యే సమస్యలను ఎమ్మెల్యే పులివర్తి నాని, అధికా రులు దృష్టికి తీసుకెళ్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా పరిశ్రమలు తీసుకొ స్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, మహి ళలు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీలను మరింత బలోపేతం చేసేందుకు కృషి



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** స్థానిక తిరుచానూరు రోడ్డులోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికార కేంద్రం (ఎన్టీఆర్ ప్రాంగణం) నందు రెండు రోజులపాటు (గురు శుక్రవారాలు) సూపర్వైజర్స్ హబ్ అంగన్వాడి శిక్షణ కార్యక్రమం "ఐటిసి ప్రథం"సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వసంత భాయి విచ్చేసి ప్రారం భించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వసంతబాయి మాట్లాడుతూ బాలల పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమం(ఈసిసిఈ) ద్వారా అంగన్వాడీలను మరింత బలోపేతం చేసేందుకు కృషిలో భాగంగా రెండు రోజులపాటు శిక్షణ కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సంబంధిత సూపర్వైజర్లు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లాకు సంబంధించిన ఎస్ ఆర్ జి అధికారులు ఎన్.జ్యోతి, వి.జ్యోతి కిరణ్, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ ఫర్జానా తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** నేడు( శనివారం ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు 132/33 శాంతిపురం నందు విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్‌కు అంతరాయం ఉండును. శాంతిపురం, రామకుప్పం, వి కోట మండలాల పరిధిలో గల 33/11 (మొత్తం 22 సబ్ స్టేషన్లు)లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వుంటుందని డివిజనల్ ఇంజనీర్ హిమ్మత్ సాగర్ తెలిపారు. పై మండలాల వినియోగ దారులు ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

# డయాబెటీస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని చెంబేడు గ్రామానికి చెందిన ప్రముఖ డయాబెటీస్ వైద్య నిపుణులు ఇరుగు అనిల్ నాయుడుపేట పట్టణంలో నూతనంగా అనిల్ డయాబెటీస్ సెంటర్ ప్రారంభిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షుగర్ మరియు థైరాయిడ్ చికిత్స కొరకు నెల్లూరు, చెన్నై పట్టణాలకు వెళ్ళనవసరం లేకుండా సిఎంసీ రాయవేలూరు మరియు చెన్నై మెహన్ డైయాబేటీస్ నందు అపార అనుభవం గడించిన డా. ఇరుగు అనిల్ కుమార్ నాయుడుపేట డయాబేటీస్ సెంటర్ ప్రారంభించమాని తెలిపారు. అదేవిదంగా ఈ డయాబేటీస్ సెంటర్ నందు షుగర్, థైరాయిడ్, హై బిపి, డైయాబేటిక్ న్యూరోపతి,డైయాబేటిక్ రేటినోపతి, డైయాబేటిక్ నెఫ్రోపతి వైద్యసేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

# 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** 10 వ తేది జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సంధర్భముగా, శుక్రవారం మండల పరిషత్తు అభివృద్ధి అధికారి, శాంతీపురం వారి కార్యాలయము నందు జరిగిన కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రల వినియోగం, నివారణ దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు. మండలానికి కేటాయించిన 7148 ఆల్బెండజోల్ మాత్రలను అంగన్ వాడీ (57), ప్రాథమిక(47), హైస్కూల్(7),ప్రవేటు స్కూల్(3), కాలేజీ(1)లలో గల 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈ మాత్రలను అందించి అలాగే పిల్లల తల్లి తండ్రులకు ఈ నులిపురుగుల నివారణపై అవగాహన చేయవలసినదిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఏపీఆర్ కుమార్ , వైద్యాధికారులు డాక్టర్ సూపర్వైజర్ శశికళ సిహెచ్ఓ లతీఫ్ ఖాన్ వైద్య సిబ్బంది పాల్గొనారు.

# ఇసుక ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్‌లకు పోలీస్ వారి సూచనలు



**నగరి, మేజర్‌న్యూస్:** నగరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులకు , డ్రైవర్లని పోలీస్ స్టేషన్ పిలిపించి వారికి కొన్ని సూచనలు ఇవ్వడం జరిగింది. నగరి మీదుగా కుశస్థలి నదిలో ఉన్న ఇసుకను సత్రవాడ కెవిఆర్పేట పేరని మెట్టు పాలెం ఏకాంబర కుప్పం ఏరియాలలో జనసంచారం ఉన్నచోట ప్రజలు ఉన్నచోట ట్రాక్టర్లని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఇసుకని రవాణా చేయడం జరుగుతుంది దాని వలన మహిళలు వృద్ధులు స్కూళ్లకు వెళ్లే చిన్నపిల్లలకు భయభ్రాంతులకు లోనై అప్పుడప్పుడు చిన్న చిన్న ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది ఇందు నిమిత్తమై డిఎస్పి సూచనల మేరకు పై విధంగా అందరినీ సమావేశపరచి వారికి ఈ క్రింది సూచనలు చేయడం జరిగింది. ప్రతి ట్రాక్టర్ నందు ట్రాక్టర్ యొక్క రిజిస్ట్రేషన్ పత్రాలు డ్రైవర్ యొక్క లైసెన్స్ తో పాటు కచ్చితంగా కలిగి ఉండాలి. ట్రాక్టర్లు ఇసుక కోసం వెళ్లేవారు ఉదయం 7 నుంచి 11 వరకు సాయంత్రం నాలుగు తర్వాత ట్రాఫిక్ ఉన్న పట్టణ ఏరియాలో రవాణా చేయకూడదు. ప్రతి ఒక్క ట్రాక్టర్ వారి అవసరాలకు తగ్గ విధంగా లోడ్లు మాత్రమే తోలుకోవాల్సి ఉంటుంది. లైసెన్స్ లేని డ్రైవర్ని అనుమతించిన ఓనర్ల పైన చర్యలు తీసుకోబడుతుంది.

# వైకాపా మండల అధ్యక్షులుగా శేఖర్ రాజు



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** వైకాపా మండల శాఖ అధ్యక్షులుగా ఈవిజి శేఖర్ రాజు నియమి తులైనట్లు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ వైయస్సార్ పార్టీ అధ్యక్షురాలు కృపా లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ రాజు మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులుగా నియమించడానికి సహకరించిన వైఎస్ఆర్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వైయస్సార్ పార్టీ గెలుపుకు కృషి చేస్తామన్నారు.

# కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల వాహన సేవల బుక్ లెట్ ఆవిష్కరణ

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** శ్రీనివాసమంగాపురం కళ్యాణ వేంటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల వాహన సేవల బుక్ లెట్‌ను టీటీడీ ఈఓ జె.శ్యామలరావు శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. తిరుమలలోని ఈవో క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఫిబ్రవరి 13వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగ నుందన్నారు. ఫిబ్రవరి 17న అంకురార్పణ నిర్వహిస్తారని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా ఫిబ్రవరి 18న ధ్వజారోహణం, 22న గరుడ వాహనం, 23న సాయంత్రం స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయన్నారు. వాహన సేవలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకుడు వేటూరి ప్రభాకర శాస్త్రి

## ఎస్వీ విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆచార్య వేంకటేశ్వర్లు



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుమల వేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని కీర్తిస్తూ శ్రీతాళ్లపాక అన్నమయ్య రచించిన సంకీర్తనా సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి భారతజాతికి అందించిన మహనీయుడు వేటూరి ప్రభాకర శాస్త్రి అని ఎస్వీ విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆచార్య వేంకటేశ్వర్లు కొనియాడారు. వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో వేటూరి ప్రభాకరశాస్త్రి 137వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య వేంకటేశ్వర్లు మాట్లాడుతూ తిరుమల శ్రీవారిపై అన్నమయ్య రచించిన సంకీర్తనలను పరిష్కరించి, వేంకటేశ్వరస్వామివారి వైభవం విశ్వవ్యాప్తం కావడానికి శ్రీ ప్రభాకరశాస్త్రి కృషి చేశారని చెప్పారు. తొలి తెలుగు కవయిత్రి తాళ్లపాక తిమ్మక్కను, తొలి తెలుగు పదం నాగబు అని పరిశోధించిన ఘనత వేటూరి వారికే దక్కుతుందన్నారు. ఆయన ప్రాచీన సాహిత్యంతోపాటు కథలు, కథానికలు కూడా రచించారని వివరించారు. ప్రముఖ సాహితీవేత్త డా.రాజశేఖర్ మాట్లాడుతూ, ఉన్నతమైన సాహితీ విలువలను, యోగ మార్గాన్ని ప్రపంచానికి అందించిన ఘనత వేటూరి వారికే దక్కుతుందన్నారు. ఆయన ప్రతి క్షణాన్ని గ్రంథోద్ధరణ కోసమే వెచ్చించారన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి అన్నమయ్య కీర్తనల భాండాగారం నుంచి చాలా రాగి రేకులను వెలికితీసి కీర్తనలను వెలుగులోకి తెచ్చినట్టు వివరించారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాలరావు మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్య రంగాల్లో విస్తృతంగా పరిశోధన చేసి వేటూరి ప్రభాకరశాస్త్రి టీటీడీకి గర్వకారణమని చెప్పారు. తన రచనలతో సమాజాన్ని ఎంతగానో చైతన్యపరిచారని తెలిపారు. వేటూరి విగ్రహానికి ఘనంగా అతిథులు పుష్పాంజలి సమర్పించారు. ఉదయం తిరుపతిలోని శ్వేతభవనం ఎదురుగా గల ప్రభాకరశాస్త్రి విగ్రహానికి టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాల రావు, గౌరిపెద్ది శంకర భగవత్పాదులు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా.సీతారామారావు అధ్యక్షతన జరిగింది. అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






# పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

## గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగాలకు పూతమిచ్చిన ఎన్‌డిఏ సర్కార్

## గ్రామీణాభివృద్ధికి రూ.190,406 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.1,37,757 కోట్లు కేటాయింపులను విశ్లేషించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:**

పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం.. 2025-26 ఆర్థిక బడ్జెట్ను పార్లమెంట్లో ప్రవేశపెట్టి, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగాలకు పూతమిచ్చి, ప్రజల చేత ప్రశంసలందుకుంటోదని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ డిప్యూటీఫ్లోలీడర్, జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంట్ కమిటీ సభ్యులు, చిత్తూరు పార్లమెంటుసభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ముందుకు సాగుతోందని తెలియజేశారు. ఇది మోదీ సర్కార్ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. కేంద్ర ఆర్థిక బడ్జెట్కు సంబంధించి, విశ్లేషణ చేశారాయన. మునుపెన్నోడు లేనివిధంగా కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక బడ్జెట్లో గ్రామీణ మంత్రిత్వ శాఖకు రూ. 1,90,406 కోట్లు, రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని 1,37,757కోట్ల రూపాయలను వ్యవసాయ మంత్రిత్వ శాఖకు కేటాయించిందని తెలిపారు. 2024-25 ఆర్థిక బడ్జెట్ సవరించిన అంచనాల కంటే 8శాతం గ్రామీణ అభివృద్ధికి, 6.8శాతం ఎక్కువగా కేటాయింపులు జరిపిందని విశ్లేషించారు. 2021 నాటికి భారతదేశ జనాభాలో 65శాతం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, వ్యవసాయాన్ని తన జీవనోపాధిగా ఎంచుకొని మనుగడ సాగిస్తున్నారని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు తెలిపారు. వ్యవసాయ రంగంలో 3.8 శాతాన్ని ఆర్థిక వృద్ధిని సాధించారని, ఇది మునుపటి కంటే 14 శాతం ఎక్కువ అని తెలియజేశారు. 2001-02 నుంచి వ్యవసాయ ఉత్పత్తి సగటు వార్షిక రేటు 3శాతం వద్ద పెరిగిందని, మిగిలిన ఆర్థిక వ్యవస్థ సంవత్సరానికి 7శాతం వద్ద దీనికి భిన్నంగా ఎక్కువైందన్నారు. ఇకపోతే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2024-25 ఆర్థిక బడ్జెట్లో సవరించిన అంచనాల మాదిరిగానే 86,000 కేటాయింపులు జరిపినట్లు తెలుస్తోందన్నారు. గ్రామీణ ప్రజలకు జీవనోపాధిగా మారిన గ్రామీణ ఉపాధి హామీ పథకం,2025 జనవరి నాటికి, 30 రాష్ట్రాలు, యూనియన్ భాగాలలో పనిచేసిన కార్మికులు, వారు అందుకున్న వేతనాలు 11రాష్ట్రాలు, యూటీలలో నోటుఫైడ్ వేతన రేటు కంటే తక్కువగా ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రెండు దశల్లో గ్రామీణ ప్రాంతాలలో రూ. 2.95 కోట్ల వ్యయంతో పి.యూ.సి.సి.ఏ గృహాలను నిర్మించాలనే లక్ష్యాన్ని కలిగి ఉందనీ, అలాగే 46వ దశలో రెండవ దశలో 195 కోట్ల గృహాలను నిర్మాణం చేయా లని భావించినట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలో 2019 నుంచి 2022 నాటికి మొత్తం 210 కోట్ల గృహాలను రెండు దశల్లో పూర్తి చేశారన్నారు. ఈ పథకానికి 54,832 కోట్ల రూపాయలను కేటాయించినట్లు చిత్తూరు ఎంపీ పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ను పరిశీలిస్తే.. గతం కంటే 69 శాతం పెరిగిందన్నారు. అయితే 2024-25 ఆర్థిక బడ్జెట్లో విడుదల చేసిన 41 శాతం నిధులను వినియోగించకపోవడం గమనార్హమన్నారు. అర్హత పొందిన గ్రామీణ ప్రాంతాలన్నిటికీ రహదారి మార్గాలను మెరుగుపరిచి, వాటిని అనుసంధానం చేసే లక్ష్యంతో, 19,000 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. 2024-25 బడ్జెట్తో పోలిస్తే ప్రస్తుతం 31 శాతం ఎక్కువ అని విశ్లేషించారు.

# పార్టీలకతీతంగా తిరుపతి రూరల్ మండలాభివృద్ధి చేద్దాం

## ఎమ్మెల్యే పులివర్తి నాని

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** తిరుపతి రూరల్ మండలాన్ని పార్టీలకు అతీతంగా, అధికారులు, పాలకులు కలసి అభివృద్ధి చేద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలంలో పంచాయతీల వారీగా కావాల్సిన సిసి రోడ్లు, డ్రైనేజ్ కాలవలు, వాటర్ ట్యాంకులు, తదితర మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను మండల అధికారులకు ఇవ్వాలన్నారు. రూరల్ మండలంలో రైతులు తమ పొలం దగ్గర ఉన్న కలప ను ఇంటి నిర్మాణ అవసరాలకు చెట్టులను కొట్టి తీసుకుని వెళితే ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు రైతులని ఇబ్బంది పెడుతున్నారని, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు, రైతుల విషయంలో సడలింపు ఇవ్వాలన్నారు. హౌసింగ్ నిర్మాణం కింద మంజూరు అయిన ఇల్లు మే లోపల నిర్మించుకోవాలన్నారు. తొండవాడ పరిధిలోనే ఉన్న ప్రభుత్వ కాలనీని మాడల్ కాలనీగా అభివృద్ధి చేస్తామన్నారు. దామినేడులో ఉన్న స్మశాన సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం నులిపురుగులు నివారణ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్, మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## బుచ్చినాయుడు కండ్రిగ మండలం వైసీపీ అధ్యక్షుడిగా కె మణి నాయుడు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ మండల వైసీపీ అధ్యక్షుడిగా వైసీపీ సీనియర్ నాయకుడు కే.మణినాయుడు నియమిస్తూ వైఎస్ఆర్సిపి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది, ఈ సందర్భంగా వైఎస్ఆర్ పార్టీ బుచ్చినాయుడు కండ్రిగ మండల అధ్యక్షుడు మణి నాయుడు మాట్లాడుతూ తనను నియమించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మద్దెల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నూక తోటి రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు, తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను శిరసా వహించి పార్టీ అభ్యున్నతికి పటిష్టతకు ఎనలేని కృషి చేస్తానని చెప్పారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రికి ముస్తాబు, రంగ వల్లికలు, అలంకారాలు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 21వతేదీ నుండి మార్చి 3 తేదీ వరకు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలు జరుగుతాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో పలు గోపురాలు. దేవస్థానంలో పలు ప్రాంతాలలో రంగ వల్లికలు. స్వామి అమ్మవార్ల ఉత్సవ వాహనాలకు రంగులతో ముస్తాబు పనులను ప్రారంభించారు. దేవస్థానంలో భక్తులకు ఉట్టిపడే విధంగా ఏ వైపు చూసినా ఆహ్లాదకరంగా ఉండే విధంగా రంగులు. డెకరేషన్లు చేస్తున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. దేవస్థానం ఈవో టి బాపిరెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చరవేగంగా జరుగుతున్నాయి. దేవస్థానం పరిసర ప్రాంతాల్లో రోడ్డు పనులు చేరువేగంగా చేస్తున్నారు.

## ధర్మరాజుల ఆలయంలో పండ్లతో అలంకరణ



**కార్వేటినగరం మేజర్ న్యూస్:** కార్వేటి నగరంలో వెలిసిన ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు, రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లు ప్రత్యేకంగా అలంకరించారు, ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
## గోడపత్రిక ఆవిష్కరించిన ఎంపీడీవో వైద్యాధికారి



**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** జాతీయ నులిపురుగుల దినోత్సవ సందర్భంగా గోడ పత్రికను ఎంపీడీవో చంద్రమౌళి, వైద్య అధికారి భువనేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఒక్కరు మాత్రలు ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. మండలంలో5889 విద్యార్థి విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అరోగ్య పర్యవేక్షకులు త్యాగు, వైద్య సిబ్బంది ఎమ్మెస్కే సచివాల సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ కే ఎస్ ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా 78వ వార్షికోత్సవ వేడుకలు

07సీటీఆర్29



కార్వేటినగరం మేజర్‌న్యూస్: కార్వేటినగరం మేజర్ పంచాయతీలో ఉన్న రాజా కుమారస్వామి రాజా ప్రభుత్వం ఉన్నత పాఠశాల 78 వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ షేక్.సందాని మండల విద్యాశాఖ అధికారులు విజయ్ కుమార్ మనోజ్ కుమార్ ముఖ్య అతిథులు దాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు మాట్లాడుతూ 2023 - 2024 సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 588 మార్కులు సాధించిన యశ్వంత్ ని సత్కరిస్తూ వివిధ అవార్డుల ద్వారా 33 వేల రూపాయలు ప్రథమ బహుమతిగా అందించారు అలాగే పి. సింధు, పి చైతన్య ,విద్యార్థినులు ద్వితీయ బహుమతి 5000 రూపాయలు అందుకున్నారు, కార్యక్రమంలో పిల్లల తల్లితండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంకాల పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** కార్వేటినగరం మేజర్ పంచాయతీ డైట్ సమీపంలో వెలసిన అంకాల పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద రాహుకాలం పూజలు, కుంకుమార్చన నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మహిళలు అర్చకులు జగదీష్ పాల్గొన్నారు.

## రాళ్ళబూదుగూరు పంచాయతీలో సామూహిక చెత్త బుట్టల ఏర్పాటు

**శాంతిపురం, మేజర్ న్యూస్:** రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీలోని పలు ప్రదేశాలలో సామూహిక చెత్త బుట్టల ను ఏర్పాటు చేశారు. గత 20 రోజులుగా రాళ్ళబూదుగూరు పంచాయతీలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్యదర్శి పి స్వాతి మరియు సర్పంచ్ లక్ష్మి మురుగేష్ నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ - స్వచ్ఛ రాళ్ళబూదుగూరు అనే నినాదంతో మనమందరం ముందుకు పోదామని పంచాయతీ కార్యదర్శి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పంచాయతీలో అన్ని గ్రామాల ప్రజలకు ప్రతి ఇంటికి చెత్త డబ్బాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా వేయాలని గ్రామ పారిశుధ్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అప్పుడే పంచాయతీ స్వచ్ఛ రాళ్ళబూదుగూరు పంచాయతీ గా చేసుకోగలమని క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ ఎస్ మని అన్నారు. ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి దాని ద్వారా రోగాల బారిన పడుకుంటా ఉంటారని తెలిపారు. రోడ్లపై పెడ దిబ్బలను చెత్తను వేయరాదని సిమెంట్ రోడ్లపై బట్టలను ఉతక రాదని ప్రజలను కోరారు. గ్రామీణ పారిశుద్ధ్య కమిటీని ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా చెత్త వేస్తే వారిపై చర్యలు కూడా తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి ఆర్ ఎస్ మని, పంచాయతీ టిడిపి పార్టీ ప్రెసిడెంట్ జయరాజు, బసవరాజు,ఉపసర్పంచ్ వెంకటరమణ, కుమార్, సురేష్, గోపినాథ్, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీల బాంధవుడు చంద్రబాబు - టీడీపీ నేతలు

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్ :** ఆర్థికంగా ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొంటున్నా కూడా బడుగుల అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేసే సియం చంద్రబాబు బిసిల బాంధవుడు అని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు 34% రిజర్వేషన్ అమలు చేసేందుకు ఆమోదం తెలపడం ఆహ్వానించదగ్గ విషయం అని హర్షం వ్యక్తం చేశారు. బిసి నాయకత్వాలను అణచివేయాలని ఎన్నో రకాల కుట్రలు పన్ని, బిసిల హక్కులను తొలగించడానికి శాయశక్తులా కృషి చేసిన వైసిపి అధినేత జగన్ రెడ్డి యొక్క కుయుక్తులను ఎప్పటికప్పుడు పటాపంచలు చేసి బిసిలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న చంద్రన్న బిసిల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, నెమళ్ళూరు బుజ్జి, మునిరాజా యాదవ్, భాస్కర్, మణి, ఉపేంద్ర, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు

**శ్రీకాళహస్తి రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని తొండమనాడు ఎగువ వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత రమాబాయ్ అంబేద్కర్ జయంతి వేడుకలు పండుగ వాతావరణంలో పాఠశాల ఇంచార్జి హెడ్ మాస్టర్ వెంకట సుబ్బలక్ష్మి సమక్షంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రమా బాయ్ సంఘం. వివాహ పరిచయ వేదిక రాష్ట్ర వ్యవస్థాపకుడు రేగంటి దేవానంద్ మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, స్వతంత్ర అనంతరం భారత దేశం మొదటి న్యాయ శాఖ మంత్రి, మహిళలు ఓటుహక్కు రూపకర్త అంబేద్కర్ ధర్మపత్ని మాత రమాబాయి గురించి వివరిస్తూ.. రమా బాయ్ గొప్ప త్యాగమూర్తి, సహనశీలి..తన కష్టంతో అంబేద్కర్ చదువుకు సహకరించిన గొప్ప విశాలా హృదయం గల వ్యక్తి అని, అంబేద్కర్ ఎదుగుదలకు వెన్నంటి నిలిచిన గొప్ప మహిళా, అలాంటి గొప్ప వ్యక్తి జయంతి వేడుకలు మన పాఠశాలలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని తెలియజేశారు.. జయంతి వేడుకలు తర్వాత పాఠశాల లోని పదవ తరగతి చదువుతున్న 36 మంది పిల్లలకు స్టడీ మెటీరియల్స్ అందించి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మొత్తం 219 మందికి యాపిల్ కేక్ లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎగువ వీధి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, జనార్ధన నాయుడు, పోతురాజు, శివ కుమార్,నాగమణి, ముని కృష్ణ రెడ్డి, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.



## దళిత వాడలో ఇళ్ల పట్టాల భూములు పరిశీలన

**నగరి, మేజర్‌న్యూస్:** నగరి నియోజకవర్గం విజయపురం మండలంలోని పేదలకు అందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని కేవీపురం దళితవాడలో జగనన్న పట్టాలకు ఇచ్చిన వారికి ఇంటి స్థలాలు చూపించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఇంకా గతవారం శుక్రవారం రోజు ఎమ్మార్వో కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గ్రామస్తుల సమక్షంలో సమస్యను ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఎమ్మార్వో ప్రత్యక్షంగా వచ్చి ఇంటి పట్టాలి ఇచ్చిన స్థలాన్ని పరిశీలిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా ఈరోజు విజయపురం మండలంలో పంచాయతీలో ఉన్న పేదల ప్రజలకి ఎస్సీ ఎస్టీ బీసీలకు అర్హులైన వారికి గత ప్రభుత్వం లో జగనన్న పేరుపైన పట్టాలు ఇవ్వడం జరిగింది. కానీ అప్పట్లో భూమి చూపించడంలో అప్పటి ప్రజా ప్రతినిధులు అధికారులు అలసత్వం ప్రదర్శించారు. అందువలన కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత ఈ సమస్యను ఎమ్మార్వో దృష్టికి తీసుకు రావడం జరిగింది.అందులో భాగంగా ఆయన ఈరోజు ప్రత్యక్షంగా వచ్చి ఇంటి స్థలాలు ఇచ్చిన సర్వే నెంబర్ 183 స్థలాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ స్థలానికి సంబంధించిన మ్యాపింగ్ పట్టాలిచ్చిన వారందరికి సంబంధించి పది రోజుల్లో సర్వే చేసి అనంతరం ప్రభుత్వం ఇచ్చే గైడెన్స్ ప్రకారం ఇంటి స్థలాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నగరి సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ పేదలకు అందరికీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన విధంగా మూడు సెంట్లు ఇంటి స్థలాల కేటాయించాలని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. గతంలో కేవీపురం దళితవాడలో సుమారు 85 మందికి సర్వేనెంబర్ 183 జగనన్న పేరుతో ఇంటి పట్టాలు ఇవ్వడం జరిగింది. అందరికీ న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మార్వోని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో తో పాటు సర్వేయర్ రాజశేఖర్ విఆర్ఓ దొరస్వామి గ్రామస్తుల తరపున సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య. నాయకులు రవి శర్వణ మోహన్ సుబ్రహ్మణ్యం వినోద్ కుమార్ పూర్ణిమ జయలలిత రాణమ్మ సంతోషం మహిళలు పాల్గొన్నారు.



# రియాజ్ అహ్మద్ పుట్టినరోజు సేవా కార్యక్రమాలు

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్ల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పంచాయతీరాజ్ డివిజన్ అసోసియేషన్ కార్యాయలంలో ఇంజనీర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు రియాజ్ పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేసి అందరికీ స్నాక్స్ ఇవ్వడం జరిగినది. ప్రభుత్వ ఆసుపత్రి నందు బాలింతలకు 25 మందికి జాన్సన్ బేబీ కిట్లు, మరియు పండ్లు జ్యూస్‌లు రియాజ్ అహ్మద్ దాతృత్వంతో ఇవ్వడం జరిగినది. లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ మల్లెమాల మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్ మాట్లాడుతూ గత 26 సంవత్సరాల నుండి లైనిజంలో రియాజ్ అహ్మద్ సేవలు ఎనలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్లు, నర్సులు, లయన్స్ సభ్యులు ఇంజనీర్లు బి .సీనయ్య, వి. వి. దయాల్, మదనమేటి రమణయ్య, క్లబ్ అధ్యక్షులు ఆర్. రవిచంద్ర, క్లబ్ మాజీ అధ్యక్షులు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కళ్యాణ సాయి, జగదీష్ చంద్ర, ఆర్ఎస్ మొబైల్స్ రాధాకృష్ణ, డి ఎస్ ఆర్ మొబైల్స్ సుధీర్ మొదలగు వారు పాల్గొని ప్రసంగించారు.



# నులిపురుగుల నివారణా వారోత్సవాలను జయప్రదం చేయండి

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** నులిపురుగుల నివారణా వారోత్సవాలను అధికారులు విధిగా నిర్వహించి జయప్రదం చేయాలని చిట్టమూరు ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆదేశించారు. ఈనెల 10వ తేదీ సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు నులిపురుగుల నివారణ వారోత్సవాల సందర్భంగా వైద్యాధికారులు,స్థానిక అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



# అమ్మ కరుణ చాలా అపారమైనది

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** గూడూరులోని మన విజయదుర్గ అమ్మ ఉపపీఠం నందు ముగిసిన రాజశ్యామల మాతంగి అమ్మవారి నవరాత్రి వేడుకల అనంతరం అమ్మవారికి అవభృత స్నానం జరిపిన తర్వాత అలంకరణ పూర్తయిన పిదప తీసిన చిత్రంలో అమ్మవారి తలభాగం పక్కకు వంచి భక్తులందరినీ కటాక్షిస్తున్నట్టుగా దర్శనమిచ్చింది. కొద్దిసేపు తర్వాత తిరిగి మళ్ళీ తీసిన మరో చిత్రాన్ని గమనిస్తే మళ్లీ అమ్మవారు యధాతతమైన రూపంలో దర్శనమిచ్చారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ధన్యులే.



# నేడు పలుచోట్ల విద్యుత్ అంతరాయం

**సూళ్లూరుపేట, మేజర్‌న్యూస్:** పట్టణంలో నేడు పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడిఈ ఆర్ శేఖర్ తెలిపారు. పట్టణంలోని శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 220కేవీ మరమ్మత్తుల కారణంగా రైల్వే గేటు పడమర వైపు సూళ్లూరు, బజార్ వీధి, గాంధ్ల వీధి, పరమేశ్వర నగర్, సాయి నగర్, జిఎంటి రోడ్డు ప్రాంతాలతో పాటు మన్నారు పోలూరు గ్రామం ,తడ మండలంలో కూడా విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున ప్రజలందరూ ఇబ్బందులను అర్థం చేసుకొని విద్యుత్ శాఖ అధికారులకు సంప్రదించవలసినదిగా ఏడిఈ కోరారు.

# నిర్దేశించిన లక్ష్యాల మేరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయండి

## నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్



**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలను బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు మంజూరు చేయాలని కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ చెప్పారు. సబ్సిడీ రుణాల మంజూరు అంశాలపై శుక్రవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో నగరపాలక సంస్థ పరిధిలోని 35 బ్యాంకుల అధికారులతో ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్సిడీ రుణాల మంజూరు ద్వారా సంబంధిత లబ్ధిదారులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తుందని, బ్యాంకుల వారీగా రుణాల లక్ష్యాలను నిర్దేశించినట్లు చెప్పారు. నిర్దేశించిన సబ్సిడీ రుణాలను నిర్దేశించిన సమయంలో బ్యాంకులు పూర్తి చేయాలని కోరారు. వార్డు సచివాలయాల ద్వారా సబ్సిడీ రుణాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వీటిని బ్యాంకులకు పంపుతామన్నారు. దరఖాస్తుదారులతో ఇంటర్వ్యూలు నిర్వహించి రుణాలు మంజూరు చేయాలన్నారు. రుణాల సబ్సిడీ అంశాలపైన బ్యాంకులకు సూచనలు అందించారు. సమావేశంలో సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, సీఎంఎం వెంకటరమణ, అధికారులు, సీవోలు పాల్గొన్నారు.



# అదానీ ఫౌండేషన్‌చే పారిశుద్ధ్యంపై శిక్షణ

**గూడూరు, మేజర్‌న్యూస్:** ముత్తుకూరు, కృష్ణపట్నం, తమినపట్నం గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యంపై అవగాహన శిక్షణ కార్యక్రమం అదానీ ఫౌండేషన్‌చే నిర్వహించారు. శుక్రవారం ఆయా గ్రామస్తులు, మహిళలతో పాటు ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘం నాయకులకు గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు, గ్రామ పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామ పారిశుద్ధ్య కమిటీ ద్వారా అవగాహన కల్పించేందుకు అదానీ ఫౌండేషన్ పారిశుధ్య నిర్వహణ అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పోలేరమ్మతల్లి మహిళా బృందం భాగస్వామ్యంతో అదానీ ఫౌండేషన్ ఈ గ్రామాల్లో ప్రచారం చేస్తూ ప్రజలను భాగస్వామ్యం చేస్తోంది. ప్రొఫెషనల్ శానిటేషన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ ఎన్ సాయినాథ్, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు మరియు స్థానిక అనుభవజ్ఞులతో కూడిన శానిటేషన్ మేనేజ్‌మెంట్ కమిటీ ద్వారా విలేజ్ శానిటేషన్ మేనేజ్‌మెంట్, శానిటేషన్ నిర్వహణ ప్రయోజనాలపై శిక్షణ ఇచ్చారు. సుమారు 100 మంది వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదానీ ఫౌండేషన్ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డా సిహెచ్ రమేష్ బాబు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈవో వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, మధురానగర్, అదాల్‌నగర్ శ్రీనివాసులు, తమినపట్నం గ్రామ సర్పంచ్ ఎన్.సుబ్రమణ్యం, కృష్ణపట్నం గ్రామపంచాయతీ సర్పంచ్‌లు సంపూర్ణ సహకారం అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అదాని ప్రతినిధులు పాల్గొన్నారు.




# అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు తగిన పారితోషికం కల్పించాలి

## పార్లమెంట్‌లో ఎంపీ మద్దిల గురుమూర్తి

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:**



సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అలాగే సెర్ప్, మెప్మా పథకాలలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ తీవ్ర అసమానతలకు గురవుతున్నారని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి నేడు పార్లమెంటు జీరో అవర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఉద్యోగులు తమ జీవితాలను సమాజ సేవ కోసం అంకితం చేస్తూనే కనీస వేతనం కూడా అందుకోలేని దుస్థితిలో ఉన్నారని ఆయన తెలిపారు. వీరి సేవలు వెలకట్టలేనివి అయినప్పటికీ, వారికి చెల్లిస్తున్న జీతాలు కనీస జీవనోపాధికి కూడా సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం సరైన జీతాలు అందాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వీరి సేవలకి తగిన గౌరవం దక్కాలని ఆయన అన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఇతర సేవకులు చాలా తక్కువ వేతనాలతో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది బంధీకృత కూలీల స్థాయికి పడిపోయిందని ఎంపీ గురుమూర్తి ఆక్షేపించారు. సమాజానికి అత్యంత కీలకమైన ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే వీరు తగిన వేతనాలను పొందలేకపోతున్నారని తెలిపారు.

**సమాజ సేవకుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలి...** ఈ సేవకుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, సమష్టి హక్కులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసి, వీరికి తగిన పారితోషికం అందించాలన్నారు. అంతేగాక, వీరికి సామాజిక భద్రతను కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. మానవతా దృక్పథంతో వీరి హక్కులను పరిరక్షిం చాల్సిన అవసరం ఉందని, వీరి సేవలను గుర్తించి ప్రావిడెంట్ ఫండ్, వైద్య భద్రత, పింఛను వంటి ప్రయోజనాలు కల్పించాలని తిరుపతి ఎంపీ డా. మద్దిల గురుమూర్తి స్పష్టం చేశారు.

# నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు క్రాస్ రోడ్ వద్ద అండర్ పాస్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. మరియు కేంద్ర మంత్రి నితిన్ ఘట్కారి ధన్యవాదాలు తెలియజేసిన గూడూరు బీజేవైఎం నాయకులు నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రజలకి అండగా ఉండే ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ పేర్కొన్నారు. భారతీయ జనతా యువ మోర్చా బీజేవైఎం గూడూరు ఆధ్వర్యంలో స్థానిక గమల్లపాలెంలో బీజేవైఎం కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి. బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశీ సూచనల మేరకు మరియు బీజేవైఎం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కిషన్ రెడ్డి సూచన మేరకు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని చిలుకూరు సర్కిల్ క్రాస్ రోడ్ వద్ద చెన్నై, కోల్కత్తా హైవే నందు తరచూ ప్రమాదాలు జరుగుతూ అనేకమంది మరణించడం అదేవిధంగా గాయాలు పాలవడం జరిగింది. ఈ ప్రమాదం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం 45.82 కోట్లతో చిలుకూరు క్రాస్ రోడ్ వద్ద అండర్ పర్సనల్ నిర్మించాలని నిర్ణయం తీసుకొని నిధులు మంజూరు చేయడం జరిగింది. అదేవిధంగా టెండర్కు ఆహ్వానం పలికామని కూడా కేంద్రమంత్రి నితిన్ గడ్కరి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వం బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలకు అవసరాలను తెలుసుకొని ప్రజలకు తోడ్పడుతూ ఇలాంటి ప్రమాదాలకు గురికాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా నిధులు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్, బీజేవైఎం కార్యదర్శి ప్రదీప్ యువతులు పాల్గొన్నారు.

